క్లుప్తంగా

బుక్స్, ఫ్యాన్ వితరణ



కొత్తకోట అప్పారావుకి పుస్తకాలు అందజేస్తున్న విజయగౌరి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలోని కొత్తకోట రామలక్ష్మి స్మారక గ్రంథాలయానికి రూ.6,500 విలువైన పుస్తకాలు, ఫ్యాన్‌ను యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కోరెడ్ల విజయగౌరి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ నిర్వాహకులు, విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ కొత్తకోట అప్పారావు మాట్లాడుతూ యువత, విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రంథాలయాన్ని సొంత ఖర్చులతో ప్రారంభించామన్నారు. మాజీ ఎంపీటీసీ కొత్తకోట అమ్మనాయుడు, యూటీఎఫ్ నాయకులు ఎస్.కిశోర్‌కుమార్, బి.ధనలక్ష్మి, పొందూరు అప్పారావు, ఎం.వాగ్దేవి, యండ ఉమాశంకర్, ఎస్.సూర్యనారాయణ, సూర స్వర్ణకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



పిల్లలకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడమే తమ సంఘ ధ్యేయమని శ్రీకాకుళం పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుంట ముక్కల వీరభద్రరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేట, బాదుర్లపేటలో సుమారు 65 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, కంపాస్ బాక్సులు, క్రియాన్సు పౌచలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కాసిన సూర్య ప్రసాదరావు, నక్కిన శాంతారావు, ఉపాధ్యక్షులు గుత్తు చిన్నారావు, కొనపల ప్రసాదరావు, తూతిక గణపతి, శంకరరావు, చప్పట లక్షణ, ముప్పన సత్యారావు, మురళి ఉన్నారు.

లలితాదేవికి 200 కేజీల కుంకుమ సమర్పణ



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేటలో వేంచేసిన లలితా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం ఆరో వార్షికోత్సవం సందర్భంగా త్రిపుర సుందర దేవికి 200 కేజీల కుంకుమను ఆదివారం సమర్పించారు. భక్తులు సమర్పించిన కుంకుమతో పూజలు నిర్వహించి, సామూహికంగా లలితాసహస్రనామ పారాయణలు జరిపారు. అనంతరం లలితాహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



వాహనానికి తాకేలా ఉన్న విద్యుత్ లైన్ వైర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం పంచాయతీ చినరావుపల్లి గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. భారీ వాహనాలు రోడ్డుపై వెళ్లేటప్పుడు తాకే అవకాశం ఉంది. వాహనాలు తరలించేటప్పుడు డ్రైవర్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. వైర్లు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా జే.ఆర్.పురం మాజీ సర్పంచ్ కొయ్యన రామలక్ష్మి, నరసయ్య, టీడీపీ నాయకులు దివ్య, అజయ్‌బాబు ఆధ్వర్యంలో 50 మంది పేదలకు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బంటుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు ఎచ్చెర్ల నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలో ఊరేగుతున్న జగన్నాథుడు



శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో రథంపై కొలువైన స్వామివార్లు



శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో ఊరేగింపులో శంఖాలతో విన్యాసాలు చేస్తున్న కళాకారులు

నేత్రపర్వంగా జగన్నాథుని రథయాత్ర



శ్రీకాకుళం కల్చరల్: కోదండ రామాలయంలో కొలువైన జగన్నాథుడు



గార: కళింగపట్నంలో జరుగుతున్న రథయాత్ర



గార: బూరవెల్లిలో పూజలందుకుంటున్న స్వామివారు

- నేటి నుంచి అవతారాలతో స్వామి దర్శనాలు

శ్రీకాకుళం కల్చరల్: ఆషాఢశుద్ధ విదియను పురస్కరించుకొని జగన్నాథస్వామి రథయాత్రను శ్రీకాకుళం పట్టణంలోని పలు ఆలయాల్లో నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. అశేష భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా రథాన్ని పూలతో, రంగురంగుల కాగితాలతో, మామిడి తోరణాలతో అలంకరించారు. జగన్నాథుడు ఊరేగేందుకు వీలుగా రథంలో పీఠాన్ని ఏర్పాటు చేసి పూలతో అలంకరించారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని రథంపై ఉంచి పురవీధులలో ఊరేగింపులు చేశారు. భక్తులు రథాన్ని లాగుతుండగా రథం ఊరేగింపు జరిగింది. మధ్య మధ్యలో భక్తుల ఇంటి ముందున నిలిపి పూజలు నిర్వహించారు. ఊరేగింపులో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భజనలతో సాగింది. స్వామిని అక్కడికి సమీపంలోని గుడిసెనగుళ్ల వద్ద ఉంచారు. సోమవారం నుంచి స్వామి ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమిస్తుంటారు. గుజరాతీపేటలో దేవదాయశాఖ పరిధిలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయంలో పెంట వంశీయులు సంప్రదాయంగా పూజలు నిర్వహించి జగన్నాథుని, సుభద్ర, బలభద్రుల మూల విరాట్టులను రథంపైన ఉంచి యాత్రను ప్రారంభించారు. ముందుగా మూలవిరాట్టులను ఆలయం చూట్టు మూడుసార్లు ప్రదక్షిణలు చేయించి, రథంలోనికి కప్పుగెంతులతో పూజారులు రథంపైకి చేర్చారు. రథాన్ని భక్తులు లాగుతూ అక్కడి దగ్గరలో ఉన్న గుడిసెనగుళ్ల వద్దకు తీసుకెళ్లి అక్కడ ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్యామలరావు ఉన్నారు.

- స్థానిక బొందిలీపురంలో ఉన్న సదావర్తి పులహారీ తఖియామఠంలో కొలువైన సుభద్ర, బలభద్రల సమేత జగన్నాథస్వామి మూర్తులను పూరీ సంప్రదాయంలో పూజలు జరిగాయి. మఠం నిర్వాహకులు లక్ష్మీదాస్ బాబాజీ పర్యవేక్షించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి పురవీధులలో ఊరేగింపు చేశారు. అడుగడుగునా భక్తుల ఇళ్ల వద్ద ఆపుతూ అక్కడి భక్తులు సమర్పించే కొబ్బరికాయ, అరటిపళ్లతో పూజలు చేశారు. భక్తులు రథాన్ని లాగుతూ ఇల్లిసుపురం కూడలి వద్దగల గుడుంచా గుడి వద్దకు చేర్చారు. అలాగే పట్టణంలో పలు శ్రీరామ మందిరాలలో ఉత్సవాలు ప్రారంభమైనాయి. పాలకొండ రోడ్డులోని కోదండరామాలయంలో అర్చకుడు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు ప్రారంభమైనాయి. భూపాలరావు వీధిలోని రామ మందరంలో, మొండేటివీధిలోని శివకామేశ్వర స్వామి దేవాలయంలో షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.

గార మండలంలో..

గార: కళింగపట్నం పంచాయితీ పెద్దపల్లిపేటలోని కోదండరామాలయంలో జగన్నాథుడి రథోత్సవం ఆదివారం సాయంత్రం నుంచి ఘనంగా ప్రారంభమైంది. తొలి దశమి సందర్భంగా ఆలయ అర్చకులు చామర్తి రాజగోపాలచార్యులు, మహేంద్రాడ కోదండరామాచార్యులు అర్చకత్వంలో సుభద్ర, బలభద్రలతో కలిసిన జగన్నాథస్వామి రథాన్ని భక్తులు నడిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి రథం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భజనలు, పూజలు నిర్వహించారు. అలాగే బూరవెల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కూడా జగన్నాథస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధానార్చకులు ఆరవెల్లి సీతారామస్వామి ఆధ్వర్యంలో సుబభద్ర, బలభద్ర సహిత జగన్నాథస్వామిని వేంచింపజేసి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధి షిర్డీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో జగన్నాథుని రథయాత్ర వైభవంగా జరిగింది. జగన్నాథుడు, సుభద్ర, బలభద్రుల విగ్రహాలను రథంపై ఉంచి తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు చేర్చి పుజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగన్నాథుని రథయాత్రపై ప్రసంగం



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న లక్ష్మీపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పొన్నాడ బ్రిడ్జి వద్దగల నాగావళి నది ఒడ్డున ఉన్న ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథస్వామి రథ యాత్ర ప్రారంభ సందర్భంగా వక్తలు ప్రసంగించారు. మందిరం నిర్వాహకులు లక్ష్మీపతి గౌర్‌దాస్ ప్రసంగిస్తూ.. జగన్నాథుడు పూరీ క్షేత్రంలో వెలిసిన విధానాన్ని భక్తులకు వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో స్వామివారి రథోత్సవం

ఘనంగా తెరవే కవి సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతి నికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక 94వ నెల వారీ సాహితీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తెరవే అధ్యక్షులు యు.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సాహిత్య విలువలు పెంపొందించేలా, సామాజిక బాధ్యతను గుర్తెరిగేలా స్ఫృహతో కూడిన నూతన శైలిలో సభ్యులంతా కవితలు రాయవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఆర్.రమణమూర్తి మాట్లాడుతూ.. ప్రతి నెలా తెరవే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కవులు ఐ.ఎస్.డి.ప్రసాద్ ఆంధ్ర కల్పవృక్షం, యూ.నాగేశ్వరరావు భూమాత, ఇద్ది పాపయ్య శ్రద్ధాంజలి, తోట గోపాలరావు అపూర్వ కథ, ఆర్.వి.రమణమూర్తి గురుబ్రహ్మ, జి.గోపాలకృష్ణ జీవతమే క్రికెట్, కె.బి.రవికిరణ్ సాలె గూడు జీవితం, పి.వి.దుర్గాప్రసాద్ చిమ్నీలు, టి.ఎర్రమ్మ స్ఫూర్తి, రెడ్డి లలిత అమ్మ ఒడిలో, ఎం.ఉపేంద్ర శర్మ కలికాలం, ఎస్.ఈశ్వరరావు రాక్షసపాలన, బి.జగన్నాథరావు కాలుష్యం-మానవుడు కవితలు వినిపించారు.

ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ



ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మందకృష్ణ మాదిగన్నకు మాదిగలంతా అండగా నిలవాలని డాక్టర్ నవిరి చిన్నారావు మాదిగ అన్నారు. మాదిగ దండోరా ఏర్పాటై 30 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శ్రీకాకుళంలోని కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్ జెండాను ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన విశ్వరూప మహాసభలో మాదిగలను ఎ, బి, సి, డిగా వర్గీకరణ చేసేందుకు ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు, రాష్ట్ర సీనియర్ నాయకులు రాణా శ్రీనివాస్ మాదిగ, దాసరి తిరుమల మాదిగ, ఎంఈఎఫ్ అధ్యక్షులు కవిటి నూకరాజు, కొల్లకోట నీలయ్య, కానుకుర్తి గోవింద్, గొంటి పోలయ్య, కూర్మాణ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనం



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: వ్యక్తి ఏకవచనం అయినా అతని శక్తి బహుళంగా ఉంటుందని, నాటి రాజరికం నుంచి నేటి ప్రజాస్వామ్యం వరకు ఇదే రుజువైందని వక్త జంధ్యాల శరత్‌బాబు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఒకే వ్యక్తి–ఐక్యశక్తి అనే అంశంపై వక్త ఆదివారం ఉపన్యసించారు. రామాయణ, భారత, భాగవత కాలం నుంచి ఆధునిక యుగం వరకూ సామాన్య మానవుడే శక్తి శీలతను నిరూపించుకున్నారని వివరించారు. ముందుగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డి.జి.పట్నాయక్, ఎం.శ్రీనివాసరావు, సంగమేశ్వరరావు, పతంజలిశాస్త్రి, నరసింహమూర్తి, వెంకటరమణ, బాబూరావు, ఈశ్వరరావు ఉన్నారు.

రామాలయానికి మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్‌ను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గార: అంపోలు పంచాయతీ రామకృష్ణాపురం గ్రామంలోని రామాలయానిక గ్లోబల్ హిందూ ఫౌండేషన్ సభ్యులు మైక్ సెట్‌ను వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులకు సంస్థ ప్రతినిధులు, భజన గురువులు ఎస్.త్రినాథరావు, జి.సత్యన్నారాయణ ఆదివారం అందజేశారు. కొన్ని రోజులుగా గ్రామంలో భజనలు నేర్పిస్తున్నారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ మురపాక సన్యాసిరావు ఉన్నారు.

మంత్రి వెంకటస్వామికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న మంత్రి వెంకటస్వామి

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లికి చెందిన రోటేరియన్ మంత్రి వెంకటస్వామికి హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ గౌరవ డాక్టరేట్‌ను ఆదివారం ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన వైదిక జ్యోతి సమ్మేళనంలో వివాహ సమస్యలు, పరిష్కారాలు అనే అంశంపై ప్రసంగాలు జరిగాయి. ఈ డాక్టరేట్‌ను ప్రముఖ జ్యోతిష్య పండితులు దైవజ్ఞశర్మ, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్ కుమార్ శర్మ, పిఠాపురానికి చెందిన ధర్మాధికారి ఇంద్రకంటి వెంకట గోపాల కృష్ణశర్మల చేతుల మీదుగా వెంకటస్వామి అందుకున్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలకు తరలిరావాలి

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గ వ్యాప్తంగా మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు సోమవారం అన్నీ గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తెలిపారు. రణస్థలం మండలం వైఎస్సార్‌సీపీ శ్రేణులు జే.ఆర్.పురంలోని వైఎస్సార్ విగ్రహం వద్దకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

జి.సిగడాం: మాజీ సీఎం, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మండలంలోని సర్వేశ్వరపురం కూడలి వద్ద సోమవారం నిర్వహించనున్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, డోల వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న హరిత సొసైటీ సభ్యులు

రణస్థలం: ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు అమ్మ పేరున మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.హరిబాబు పిలుపునిచ్చారు. హరిత సొసైటీ ఆధ్వర్యంలో వెంకటరావుపేట గ్రామంలోని బంగారమ్మతల్లి అమ్మవారి గుడి ఎదురుగా అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. సొసైటీ కార్యదర్శి పి.తవిటినాయుడు, వన సంరక్షణ ఔత్సాహిక కార్యకర్త వి.వీరారెడ్డి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేతకు ఘనంగా నివాళి



ఓంకార్ మాస్టార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పలాస: ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, ఉద్దానం ప్రాంతంలోని వివిధ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన బత్తిన ఓంకార్ మాస్టారుకు వివిధ విప్లవ, వామపక్ష ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఓంకార్ ఇటీవల గుండెపోటులో మృతి చెందారు. ఆయన సంతాప సభను ఏపీ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనరు అజయశర్మ, రిటైర్డు జీఎస్టీ అసిస్టెంటు కమిషన్ జుత్తు తాతారావు, ప్రముఖ వైద్యులు తెప్పల ఆనంద్ తదితరులు మాట్లాడుతూ.. ఓంకార్ మాస్టార్ సాన్నిహిత్యాన్ని, చేసిన ఉద్యమాలను వివరించారు. పేదరికంలో జన్మించిన ఆయన అంచెలంచెలుగా పట్టుదలతో ఆంధ్రా యూనివర్సిటీ వరకు చదువుకొని ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారన్నారు. ఉద్దానం ప్రాంతంలోనే ఎక్కువ కాలం పనిచేసి ఈ ప్రాంత సమస్యలపై పోరాడిన ధీశాలని గుర్తు చేశారు. సభలో ఓంకార్ సేవలను కొనియాడుతూ పలువురు కవులు, కళాకారులు నిశితాసి, కుత్తుం వినోద్, హేమసూధన్ , ముసలయ్య, నెయ్యిల చంద్రయ్య, కరుణాకర్ తదితరులు పాటలు పాడి వినిపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాతిన కృష్ణమూర్తి, జుత్తు సింహాచలం, ఎల్.వి.చలం, లండ బాబూరావు, ఎన్.గణపతి, దుమ్ము శంకరరావు, గేదెల నీలకంఠం, కుత్తుం ప్రకాశరావు, బొమ్మాళి శివ, జి.లోకేశ్వరరావు, కోనారి మోహనరావు, పోతనపల్లి గీతమ్మ, కోరాడ లింగమూర్తి, సూర్యోదయ యువజన సంఘం అధ్యక్షుడు దిలీప్ కుమార్, కార్యవర్గ సభ్యుడు అశోక్ పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు



పోటీలలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో వేంచేసిన చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు పద్య పఠనం, ఆటల పోటీలు ఆదివారం జరిగాయి. 30 మంది చిన్నారులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. వారికి సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. బి.ఇంద్రాణి (ప్రథమ), బి.రోషిని (ద్వితీయ), సాత్విక (తృతీయ), సుధన్‌సాయి (నాలుగో) స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ప్రసాద్, ఎల్.దీప్తి, ఇందుమతి, సంయుక్త పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడు మృతికి సంతాపం



సాహుకారి కృష్ణమూర్తి (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం పట్టణంలో నివసిస్తున్న రిటైర్డు ఉపాధ్యాయుడు సాహుకారి కృష్ణమూర్తి మాస్టార్ గుండెపోటుతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. మండలంలోని లొద్దపుట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేసి మూడేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. 1982లో కోటబొమ్మాళి సీబీఎం ఎయిడెడ్ స్కూల్లో ఉపాధ్యాయుడుగా ప్రస్థానం మొదలు పెట్టిన ఆయన 1983 నుంచి ఇచ్ఛాపురంలోనే ఉంటూ పలు గ్రామాల్లో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించారు. ఎం.తోటూరులో సొంతంగా సత్యసాయి పేరున పాఠశాలను నెలకొల్పి ఏటా 50 మంది పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత చదువులు చదివిస్తూ వస్తున్నారు. సామాజిక కార్యక్రమాల్లో సైతం చురుగ్గా పాల్గొనేవారు. ఆదివారం మధ్యాహ్నం ఎం.తోటూరులోని పాఠశాల వద్దనే గుండెపోటుతో కుప్పకూలి ప్రాణాలు విడిచారు. కృష్ణమూర్తికి భార్య లక్ష్మి, కుమారుడు భానుతేజ ఉన్నారు. ఆయన మృతిపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ పిట్ట శశిరేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్ట మామయ్యరెడ్డి, చాట్ల తులసీదాసురెడ్డి సంతాపం తెలియజేశారు.